క్లుప్తంగా...

ప్రమాదాలు జరగకుండా రేడియం స్టిక్కర్ల ఏర్పాటు



మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేబుల్ చౌరస్తా, నెహ్రూనగర్ ప్రధాన రహదారిలో రోడ్డులో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు ప్రమాదాలు జరగకుండా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఆదివారం కుషాయిగూడ ట్రాఫిక్ ఎస్ఐ మల్లయ్య ఆధ్వర్యంలో రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశారు.

ఘనంగా బోనాలు



మల్కాజిగిరి : మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్లలోని కొన్ని కాలనీల్లో ప్రజలు శ్రావణ మాసం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉప్పరిగూడ, లెప్రసీకాలనీలోని పోచమ్మ దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. బాబు,సత్యనారాయణ,సంపత్,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాదానం అన్నింటికన్నా గొప్పది



మల్కాజిగిరి: అన్నింటికన్నా విద్యాదానం గొప్పదని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. విద్యానిధి సహకార సంస్థ ఆధ్వర్యంలో 15 మంది నిరుపేద విద్యార్థులకు 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రవణ్ మాట్లాడుతూ చాలా మంది చదువుకోవాలని ఉన్నా ఆర్థిక స్తోమత లేక చదువు ఆపేస్తున్నారని అటువంటి వారికి చేయూత నందిస్తే ఆ కుటుంబానికి బాసటగా నిలిచినవారమవుతామన్నారు. సంస్థ నిర్వాహకులు రాంబాబు,నారాయణ మూర్తి పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌కు ఫ్రిడ్జ్ అందజేత



కాప్రా: కుషాయిగూడలోని కూరగాయల మార్కెట్‌కు వచ్చే ప్రజల కోసం బీఎల్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఫ్రిడ్జ్‌ను అందించారు. ఈ ఫ్రిడ్జ్‌ను ఆదివారం ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. నిత్యం మార్కెట్ వందల సంఖ్యలో వచ్చే ప్రజల తాహార్తిని తీర్చేలా ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి కొనియాడారు.

రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం



రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

ఉప్పల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు ఆదివారం ఉప్పల్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. ప్రశాంతంగా ఉన్న ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రూపు రాజకీయాలతో రణరంగంగా మార్చారని విమర్శించారు. కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, సీనియర్ నాయకులు గంధం జ్యోత్స్న, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఆదివారం మున్సిపల్ కమిషనర్ రాములు సిబ్బందితో కలిసి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఆదివారం 10గంటలకు 10 నిమిషాలు కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటి పరిధిలో పారిశుధ్య కార్మికులతో కలిసి మురికి కాలువలు శుభ్రం చేయించారు.

చేపల పెంపకంపై దృష్టి

- ఆగస్టు రెండో వారం నుంచి చెరువుల్లోకి చేప పిల్లలు
- 91 లక్షల చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ కార్యాచరణ



సాక్షి,మేడ్చల్ జిల్లా: ఈ ఏడాది ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లలను ఆగస్టు రెండో వారం నుంచి చెరువుల్లో వదిలేందుకు జిల్లా మత్స్యశాఖ సిద్ధవుతోంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలలో చెరువులు నిండటంతోపాటు చేప పిల్లల టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావటంతో చేప పిల్లలను వదిలేందుకు అన్ని చర్యలు తీసుకుంటోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 345 చెరువులు,కుంటల్లో 91లక్షలు చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా మత్స్యశాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఎంపిక చేసిన చెరువులు/కుంటల్లో నిర్ణీత గడువులోగా వదలటానికి పూర్తి స్థాయి కసరత్తు చేస్తోంది.

- ఈ ఏడాది 345 చెరువుల్లో విడతల వారీగా 91 లక్షల చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించగా, ఇందులో పెద్ద సైజు చేప పిల్లలు (80-100 ఎం.ఎం.) 13.50 లక్షలు, చిన్న సైజు చేప పిల్లలు(40-45 ఎంఎం) 77.50 లక్షలు ఉన్నాయి.
- 59 మత్స్య సహకార సంఘాలు....2,765 మంది సభ్యులు జిల్లాలో 58 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, ఇందులో 2,765 మంది సభ్యులున్నారు.ఇందులో 8 సంఘాలు కొత్తగా ఏర్పడ్డాయి. ఏడాది మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఆధ్వర్యంలో చేప పిల్లలను చెరువులు, కుంటల్లో పెంచాలని నిర్ణయించారు.
- 13 మహిళా మత్స్య సహకార సంఘాలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, ఇందులో 700 మంది సభ్యులు ఉన్నారు. ఈ సంఘాల సభ్యులు చేపలు అమ్ముకోవటం, రంగు చేపల ఉత్పత్తి వంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నారు.
- చేప పిల్లల పంపిణీకి కట్టుదిట్టమైన చర్యలు బి.పూర్ణిమా ,మత్స్యశాఖ జిల్లా అధికారి,మేడ్చల్-మల్కాజిగిరి గత ఏడాది చేపపిల్లల పంపిణీలో ఆలస్యం జరిగింది. ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాదిలో ఆగస్టు రెండో వారం నుంచి చేప పిల్లల పంపిణీకి కసరత్తు చేస్తున్నాం.చేప పిల్లల సైజులోనూ,ప్యాకెట్లలోనూ ఎలాంటి తేడాలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

19వ రోజు ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి పాదయాత్ర



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కాప్రా: ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర 19వ రోజుకు చేరుకుంది. నమస్తే ఉప్పల్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాదయాత్ర ఆదివారం మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో కొనసాగింది. ఎన్టీఆర్ నగర్, జయశంకర్‌కాలనీ, శాంతినగర్, ఓల్డ్ మీర్‌పేట్, నర్సింహానగర్, అన్నపూర్ణకాలనీ, లక్ష్మీనగర్, శ్రీనివాసనగర్ కాలనీల్లో తిరిగి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటుకు కృషి



సమావేశంలో పాల్గొన్న శ్రవణ్, నందికంటి శ్రీధర్

మల్కాజిగిరి: సఫిల్‌గూడ రైల్వే గేట్ మూసివేయడంతో కాలనీవాసుల ఇబ్బందులు తొలగించడానికి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటుకు సహకరిస్తామని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. ఆదివారం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిది బి.టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వెస్ట్ శ్రీ కృష్ణానగర్ కాలనీ అసోషియేషన్ కార్యాలయంలో కాలనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గేట్ మూసివేయడంతో సుమారు ఆరువేల కుటుంబాలకు చెందిన ప్రజలు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారని బి.టి.శ్రీనివాస్ వారి దృష్టికి తీసుకొని వచ్చారు. సఫిల్‌గూడ వద్ద జైన్ బాలాజీ గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణం పూర్తయిందని దీనితో గౌతం నగర్ ఆర్‌యూబీ మీదుగా ట్రాఫిక్ పెరుగుతుందని పరిష్కారమార్గంగా సీతారాంనగర్-బలరాంనగర్ రైల్వే ట్రాక్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం జరిగితే సమస్య పరిష్కారమవుతుందన్నారు.

గ్రామదేవతలను పూజించడం సంస్కృతిలో భాగం



అమ్మవారి ఘట్టం కార్యక్రమంలో పాల్గొన్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: బోడుప్పల్ ఇలవేల్పుగా గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతిలో భాగమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు దేవరకొండ వీరాచారి ఇంట్లో ఆదివారం అమ్మవారి ఘటం ఊరేగింపు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ సర్పంచ్ తోటకూర లక్ష్మి, కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు తోటకూర చందర్‌యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవం



కాప్రా: కుషాయిగూడ మార్కెట్‌యార్డులో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించి పలువురు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, బీఎల్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిందని బోడుప్పల్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 15వ డివిజన్ బొల్లిగూడెం బాల చిత్తారి కాలనికి చెందిన పద్మకు రూ 45వేలు, 16వ డివిజన్ భవానినగర్‌కు చెందిన వెంకటేశ్‌గౌడ్‌కు రూ 60వేలు మంజూరు కాగా ఆయన ఆదివారం అందజేశారు.నాయకులు కొత్త చక్రపాణిగౌడ్, జక్క జయ రాములు, కృపాసాగర్, కీర్తన్‌రెడ్డి, మోతే రాజు, రాఘవేంద్రరెడ్డి, చిన్నింగల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న నంబూరి కృష్ణంరాజు

కాప్రా: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పర్యావరణ వేత్త, పక్షి ప్రేమికుడు నంబూరి కృష్ణంరాజు. ఆదివారం ఈశ్వరిపురి కాలనీలోని తన నివాసం వద్ద ఉచితంగా మొక్కలు, పక్షిగూళ్లు పంపిణీ చేశారు. పర్యావరణ సమతుల్యత సమస్యలతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రతిఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు

మోసం చేసిన చిట్టీ నిర్వాహకుల అరెస్ట్



అరెస్ట్ అయిన సత్యనారాయణ, మోహన్

మల్కాజిగిరి: చిట్టీల పేరున మోసం చేసిన ఇద్దరు నిర్వాహకులను మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన మేరకు.. జెఎల్‌ఎన్‌ఎస్ నగర్‌కు చెందిన మహేశ్వరం సత్యనారాయణ(65),అతని కుమారుడు మహేశ్వరం మోహన్(42) కొన్ని సంవత్సరాలుగా చిట్టీలు నిర్వహిస్తున్నారు. గత కొంత కాలంగా చిట్టీ పాడుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా దాటవేస్తున్నారు. ఇటీవల వారు ఉంటున్న ఇంటిని కూడా ఖాళీ చేసి వెళ్లిపోయారు.దీనితో బాధితులు మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు వినాయకనగర్‌లో నివాసముంటున్న ఇద్దరినీ శనివారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఫ్లెక్సీ వివాదం పలువురిపై కేసు నమోదు

ఉప్పల్: ఉప్పల్‌లో శనివారం జరిగిన టీపీసీసీ రేవంత్ రెడ్డి పర్యటనలో కాంగ్రెస్ నాయకుల మధ్య జరిగిన ఫ్లెక్సీ చించివేతతోపాటు పలువురిపై దాడి విషయంలో గాయడిన నరేష్ తో పాటు మరికొందరు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి తెలిపిన మేరకు.. నరేష్‌ను కొంత మంది దాడి చేసి గాయపరిచి కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో మంద మురళి కృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, వై. రామకృష్ణ, రఘునాథ్ రెడ్డి, బంటి, నరేష్, శ్రీకాంత్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటితో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



అమ్మోరు తల్లి ప్రతిమ

అమ్మవారికి బోనాల సమర్పణ

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మహంకాళి భవానీ అమ్మవారికి మహిళలు బోనాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఓల్డ్ మల్లాపూర్ ఈదమ్మ, వెంకటరమణ కాలనీలోని ఆరె పోచమ్మ, అన్నపూర్ణ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో మహిళలు డప్పు చప్పులతో వచ్చి బోనాల సమర్పించారు. బోనాల పండుగకి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, బండారి లక్ష్మారెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈస్ట్ బాలాజీ హిల్స్ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్

బోడుప్పల్: ఈస్ట్ బాలాజీ హిల్స్ కాలనీ ఫేస్ 1లో ఆదివారం 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్ పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీని పరిశీలించి తక్షణం చర్యలు తీసుకోవాలని వార్డు ఆఫీసర్‌ను ఆదేశించారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, విజయలక్ష్మి, కాలనీ అధ్యక్షులు రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా బోనాల వేడుక

గౌతంనగర్: మల్కాజిగిరి సర్కిల్ గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జేఎల్‌ఎన్‌ఎస్‌నగర్‌లో ఆదివారం బోనాల వేడుకలు అంగరంగ వైభవంగ జరిగాయి. ఉదయం నుండే ఆలయ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ నందికంటీ శ్రీధర్, హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌర్యం కలుగకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు సాదు పరమేష్, అనిల్, సత్యనారాయణలు ప్రత్యేక ఏర్పాటు చేశారు.



ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

ఉప్పల్‌లో శాంతి ర్యాలీ

ఉప్పల్: మణిపూర్ ఘటనలో భాగంగా అక్కడి క్రైస్తవ బాధితులకు అండగా ఉంటామని, వారికి సంఘీ బావంగా ఉప్పల్ మండల పాస్టర్స్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ శాంతి ర్యాలీ రామంతాపూర్ పబ్లిక్ స్కూల్ నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు సాగింది. అనంతరం ఉప్పల్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రార్ధనలు చేసి మృతులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కే.ప్రకాశ్‌రావు, టి.సత్యం,జాన్ ముల్లర్, జీకే బాబు, గోన పిలిప్స్, జేరు సలేం మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేసిన ఎమ్మెల్యే



సత్యంకుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

గౌతంనగర్: ఇటీవల గౌతంనగర్ డివిజన్ పరిధిలోని శివాజీ ప్రసాద్ కుమారుడు సత్యంకుమార్ (6)పై వీధి కుక్కలు దాడి చేయడంతో విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం ఆ కుటుంబాన్ని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌తో కలిసి పరామర్శించి రూ. లక్షా ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

ఘనంగా సెయిట్ ఆన్స్ ఫిస్ట్



మల్లాపూర్: మల్లాపూర్ సెయిట్ ఆన్స్ ఫిస్ట్ చర్చిలో ఆదివారం సెయింట్ ఆన్స్ ఫిస్ట్ కార్యక్రమాని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, జెరిపోతుల ప్రభుదాస్, సెయింట్ ఆన్స్ పాదర్ సురేష్ పాల్గొన్నారు.

తైక్వాండోలో ప్రతిభ చూపిన విద్యార్థులు



మేడ్చల్: జిల్లా తైక్వాండో పోటీలలో మేడ్చల్ కు చెందిన విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. కొంపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో మేడ్చల్ కు చెందిన అకాడమీల విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. 200 మంది వరకు పాల్గొన్న విద్యార్థులలో మేడ్చల్ విద్యార్థులు పలువురు ప్రతిభ చూపి మెడల్స్ సాధించారు.

18వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ భవానిగౌడ్

మేడ్చల్: పట్టణంలోని 18వ వార్డు (పాతమేడ్చల్)లో సీసీ రోడ్డునిర్మాణ పనులను వార్డు కౌన్సిలర్ భవాని రాఘవేందర్‌గౌడ్ ప్రారంభించారు. 17,18వ వార్డులలో రూ. 20లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. పట్టణంలో 18వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు నాయకులు కృష్ణమూర్తిచార్యులు, మోహన్‌రావు, శ్రీనివాస్, వెంకటేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



అల్వాల్: ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం యాప్రాల్‌లోని లక్ష్మీనారాయణ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటీ పరీక్ష శిబిరం నిర్వహించారు. రాంచందర్‌రావు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు పదినిమిషాల కార్యక్రమాన్ని 13వ వార్డులోని ఇందిరమ్మ కాలనీలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాగౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ప్రజలంతా తమ పరిసరాలను శుభ్రపరచాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వసుపతి రమేష్‌గౌడ్, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రభు, మున్సిపల్‌కార్మికులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

మేడ్చల్: ప్రధాన మంత్రి పదవికి నరెంద్రమోదీ రాజీనామా చేయాలని, మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. మేడ్చల్ లో మణిపూర్ అల్లర్లను నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు చేతబట్టి తమ నిరసనను నిర్వహించారు. ఈసంధర్భంగా కేఏ పాల్ మాట్లాడుతూ.. దేశంలో 99శాతం మంది హిందువులు శాంతిని కోరుకుంటున్నారని, కొంతమంది తమ స్వార్థం కోసం మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని అన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కీసర: నాగారం మున్సిపల్‌పరిధిలోని రాంపల్లిలో ఆదివారం వెంకటాపూర్ నీలిమ హాస్పిటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని మున్సిపల్‌చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్యులు 425 మందికి వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీచేశారు. నీలిమ ఆసుపత్రి సీఈఓ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

